క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



నవీపేట: కమలాపూర్‌లో సుఖీభవ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి(నిజామాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలు రోగాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు కేవీ భాస్కర్‌రెడ్డి, రాజ్ కమల్ గౌడ్, సిబ్బంది కీర్తన్, సందీప్, కవిత, భావన, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టు కాలనీలో శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛకాలనీ– సమైక్య కాలనీలో భాగంగా శ్రమదానం చేశారు. కాలనీలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను తొలగించి, రోడ్లను శుభ్రం చేశారు. మురుగుకాలువల వెంట, రోడ్లపై బ్లీచింగ్ పౌడర్‌ను చల్లారు. కాలనీవాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిటీ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి కమలాకర్, ఉపాధ్యక్షుడు కొక్కెర భూమన్న, సుంకె శ్రీనివాస్, కొంతం రాజు తదితరులు పాల్గొన్నారు.

మనకంటే ఆంధ్రాలోనే మెరుగైన విద్య

నిజామాబాద్‌అర్బన్: మన రాష్ట్రం కంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెరుగైన విద్య అందుబాటులో ఉందని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ అన్నారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ విషమయంలో కేంద్రం ఈసంవత్సరం ఆరు ప్రామాణికల ఆధారంగ సర్వే చేపట్టిందన్నారు. సర్వేలో మన రాష్ట్రం 31వ స్థానంలో నిలువగా, ఆంధ్రప్రదేశ్ 16వ స్థానంలో నిలిచిందన్నారు. మన రాష్ట్రంలో పాఠశాల, కళాశాల, యూనివర్సిటీ స్థాయిలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ పోస్టులను భర్తీ చేయాలి



నిజామాబాద్‌అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. నగరంలో ఆదివారం సంఘ సమావేం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీచర్లకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని, స్కావెంజర్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు రాములు, ప్రవీణ్, సంధ్యారాణి, స్వర్ణసమత, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం ఖానాపూర్, మహమ్మద్‌నగర్‌కు చెందిన 200 మంది బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన కార్యకర్తలు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి నిజామాబాద్ రూరల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి భూపతిరెడ్డి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. రూరల్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్, సంతాజీ ఉషన్నా, రాజలింగం, మీరభాయ్, సంగం బాలు, ముస్తఫా, సాయిలు, గురుస్వామి, బోజ్జ రాజు, చిన్న అబ్బు నర్సారెడ్డిలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే ప్రారంభిస్తాం



ధర్పల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి ఒక కిలోమీటర్ మేర సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులకు ప్రభుత్వం రూ.6.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో రోడ్డు విస్తరణ పనులను ఆదివారం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్, అధికారులు పరిశీలించారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు సురేష్, సుదీర్, మనోహర్, సర్పంచ్ ఆర్మూర్ బాలరాజ్, వీడీసీ సభ్యులు ఉన్నారు.

బిల్లులు రాక.. పనులు సాగక

- పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరమ్మతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం
- మన ఊరు–మన బడిలో భాగంగా రూ.3.29 కోట్ల నిధులు మంజూరు
- రెండు నెలలుగా ముందుకు సాగని పనులు



పోచంపాడ్‌లో నిలిచిన పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్(ఎస్సారెస్పీ)లోని ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు సంబంధించి సకాలంలో బిల్లులు అందడం లేదంటూ కాంట్రాక్టర్ పనులు నిలివేశాడు. దీంతో రెండు నెలలుగా పనులు ముందుకు సాగడం లేదు. మన ఊరు– మన బడి పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్‌లు ముందుకు రాక ఉమ్మడి బాల్కొండలో అన్ని ప్రభుత్వ పాఠశాలల పనులకు టెండర్‌లు కావడం లేదు. లేక లేక పోచంపాడ్ పాఠశాలకు టెండర్ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. అది కూడ బిల్లులు అందడం లేదంటూ కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశారు. పోచంపాడ్‌లోని మూడు ప్రభుత్వ పాఠశాలలకు రూ. 3.29 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత జనవరిలో పనులను ప్రారంభించారు. ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రూ.2.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గతంలో నిధుల లేమితో నిలిచి పోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను కలుపుకుని నూతన భవనం తలపించేలా అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభించారు. స్లాబ్ వేసి పనులను పూర్తి చేశారు. బిల్లులు అందకపోవడంతో ప్లాస్టరింగ్ పనులను చేపట్టలేనని కాంట్రాక్టర్ పనులను నిలిపి వేశాడు. ప్రభుత్వ పాఠశాల రేకుల షెడ్డుతో ఉండటంతో దాని మరమ్మతులు కూడ చేపట్టడానికి ఇందులోనే నిధులు కేటాయించారు. మొత్తం 295 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇన్నాళ్లు రేకుల షెడ్డులో తరగతుల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు వేగంగా చేపట్టి పూర్తి చేస్తే ఆ ఇబ్బంది తీరనుంది. పనులు వేగంగా సాగేల అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బిల్లులు వస్తున్నాయి

పోచంపాడ్ ప్రభుత్వ పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల బిల్లులు వస్తున్నాయి. ముందు కొంత జాప్యం జరిగినా ప్రస్తుతం ఇబ్బంది లేదు. పనులను వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

– అంజిరెడ్డి, ఆర్‌ఎంఎస్, డీఈ

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి



రాణంపల్లి క్యాంపులో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గంగారాం



కోటగిరిలో ..

రుద్రూర్: అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని జెడ్పీటీసీ నరోజి గంగారాం అన్నారు. రాణంపల్లి క్యాంపు వద్ద ఆదివారం బీటీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాణంపల్లి క్యాంపు నుంచి రాణంపల్లి వరకు వేసే బీటీరోడ్డు పనులకు రూ.24 లక్షల నిధులను అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దయాల రోజా, ఉప సర్పంచ్ బోయి వెంకటి, రైతు సమితి మండల అధ్యక్షుడు తోట సంగయ్య, మండల బీఆర్‌ఎస్ కార్యదర్శి నెరగంటి బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో సీసీ రోడ్డు పనులు..

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని వినాయకనగర్ కాలనీలో ఆదివారం సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ పత్తి లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ పనులకు అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, మాజీ వైస్ ఎంపీపీ వల్లేపల్లి శ్రీనివాస్ రావు, నాయకులు పి.సాయిలు, గజేందర్, సలీం, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించండి



రుద్రూర్: ప్రభుత్వ వసతి గృహాల్లో కనీస వసతులు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లను ఆదివారం వారు పరిశీలించారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. బీసీ హాస్టల్‌లో టాయిలెట్స్ తలుపులు సరిగా లేవని, ఎస్సీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు దుప్పట్లు ఇంకా రాలేదన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రానందున వాటర్ ట్యాంక్ నీటిని వాడుతున్నారని తెలిపారు. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేనట్టయితే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు నల్ల గంగాధర్, నీలి దత్తు, హన్మాండ్లు, రవి, రాములు ఉన్నారు.

కాంగ్రెస్ అనుబంధ కమిటీ ఏర్పాటు

రుద్రూర్: మోస్రా మండల కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీలను ఆదివారం మండల అధ్యక్షుడు కొతిమీర్‌కర్ లక్ష్మణ్ ప్రకటించారు. మోస్రా మండల కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడిగా బొజ్జ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా సంఘం సాయిలు, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా మౌలానా, సేవాదళ్ అధ్యక్షుడిగా ఎండీ షబ్బీర్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా సల్మాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షులు ఎంటికల శంకర్, మండల కిసాన్ కేత్ అధ్యక్షుడిగా తోటరాజు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సంఘం సాయిలు, తదితరులు పాల్గొన్నారు

'చలో ఇందిరాపార్కు'ను విజయవంతం చేయాలి



సుదర్శన్‌రాజ్

రెంజల్(బోధన్): రాష్ట్ర పెన్షనర్ల జేఏసీ ఈ నెల 12న తలపెట్టిన చలో ఇందిరాపార్కు మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పోలీస్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు(రిటైర్డు ఎస్సై) సుదర్శన్‌రాజ్ కోరారు. ప్రభుత్వ వైఖరితో విసిగిపోయిన పెన్షనర్లు కొలిశెట్టి లక్ష్మయ్య నాయకత్వంతో మహాధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ వస్తే మా బతుకులు బంగారమైతాయని ఎంతో సంబురపడ్డ భ్రమలు బట్టబయలయ్యాయని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ధర్నాలు, పికెటింగ్‌లు ఉండవని చెప్పి చివరకు ధర్నాచౌక్‌ను ఎత్తేసారని అన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్‌లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ సిఫార్సులన్ని అమలు చేయాలని, గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పెన్షనర్లకు ఇచ్చిన హామీని నిలుపుకోవాలని సూచించారు. పెన్షన్‌లో కమ్యూటేషన్ కోతను 12 ఏళ్లకే కుదించాలన్నారు. రూ. 398 స్పెషల్ టీచర్ల సర్వీసు కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు అందిస్తూ పెన్షన్ బెనిఫిట్స్ మంజూరు చేయాలన్నారు.

బందళ్ల రోడ్డు పనులు పూర్తి చేయండి

– 12వ రోజుకు చేరిన రైతుల దీక్షలు



రెంజల్‌లో కొనసాగుతున్న రైతుల దీక్షలు

రెంజల్(బోధన్): రెంజల్ నుంచి ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి వరకు గల బందళ్ల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ రెంజల్ మండల కేంద్రంలో రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం చుక్కరాజు గౌడ్, కుర్మె శ్రీనివాస్ యాదవ్, సున్నం పోశెట్టి, శ్రీనివాస్, ఒడ్డెన్న అనే రైతులు దీక్షలో కూర్చున్నారు. పలువురు రైతులు వారికి సంఘీభావం ప్రకటించారు. పార్టీలకు అతీతంగా చేపడుతున్న నిరసనను పాలకులు పట్టించుకోవాలని, లేని పక్షంలో తీవ్రతరం చేస్తామని రైతులు పేర్కొన్నారు. వర్షాకాంలో ఎడపల్లి మండలం మీదుగా పంటపొలాలకు రావాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏడేళ్లయినా అద్దె భవనాల్లోనే..

- మోపాల్ మండల ప్రభుత్వ కార్యాలయాల దుస్థితి
- అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసేందుకు సిద్ధమైన యజమాని



మోపాల్(నిజామాబాద్‌రూరల్): ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం మోపాల్ మండలాన్ని ప్రకటించి ఏడేళ్ల గడిచినా.. ప్రభుత్వ లక్ష్యం మాత్రం నేటికీ నెరవేరడంలేదు. అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు కొనసాగుతుండటంతో ప్రజలకు కనీస వసతులు కల్పించడం లేదు. నేటికీ తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంఈవో, ఎంపీడీవో, ఐకేపీ ఏపీఎం, ఈజీఎస్, తదితర శాఖలకు సొంతభవనాలు లేవు. ఇప్పటికీ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ అద్దెభవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కొరత పేరుతో కాలయాపన చేస్తున్నారు.

పేరుకుపోయిన అద్దె బకాయిలు..

మోపాల్ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, ఐకేపీ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈయేడాది జనవరి నుంచి తహసీల్దార్ కార్యాలయం, ఏడాదిన్నరపైగా ఎంపీడీవో కార్యాలయ అధికారులు అద్దె చెల్లించడం లేదు. దీంతో సుమారు రూ.3లక్షలకుపైగా అద్దె బకాయిలు పేరుకుపోయాయి. దీంతో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఇంటి యజమాని గతంలో పలుమార్లు ప్రజావాణికి ఫిర్యాదు చేయడంతో పాటు తహసీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన ఘటనలు ఉన్నాయి. అద్దె కోసం యజమాని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. అధికారులు మాత్రం రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం నేడో.. రేపో ఆయా కార్యాలయాలకు తాళం వేసేందుకు ఇంటి యజమాని సిద్ధమైనట్లు తెలిసింది. కార్యాలయాల్లో కనీస వసతులు, మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు.

వారం రోజుల్లో అద్దె చెల్లిస్తాం

ఎంపీడీవో కార్యాలయంతోపాటు ఈజీఎస్‌కు కలిపి ప్రతినెలా రూ.12వేలు అద్దె చెల్లిస్తాం. ఏడాదిన్నర నుంచి బకాయి ఉన్న మాట వాస్తవమే. రూ.2లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. యజమాని తరచూ కార్యాలయానికి వస్తున్నారు. ఉన్నతాధికారులు, ఎంపీపీతో చర్చించి ఈ వారంలో అద్దె చెల్లిస్తాం.

–లింగం నాయక్, ఎంపీడీవో, మోపాల్

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలో ఆదివారం ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలో వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇందూర్ విభాగ్ ప్రముఖ్ నరేష్ మాట్లాడుతూ.. విద్యారంగం సమస్యలపై ఏబీవీపీ నిరంతరంగా పోరాడుతూ, ఎన్నో ఉద్యమాలు చేపట్టిందన్నారు. సంఘ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు పట్టాలు ఇస్తాం



పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూపతిరెడ్డి

ఇందల్వాయి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన గిరిజనులతో పాటు గిరిజనేతరులకు పోడు పట్టాలు అందిస్తామని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ రూరల్ ఇన్‌చార్జి డా. భూపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మేఘ్యానాయక్ తండాలో ఆదివారం ఆయన పర్యటించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. అర్హులైన గిరిజనులతో పాటు గిరిజనేతరులకు పోడు పట్టాలు అందించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏక కాలంలో రుణమాఫీ, ఇంటి నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులకు ప్రజలు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, కర్సం మోహన్, బాబురావు, లారి గంగారెడ్డి, సోమ్లనాయక్, ఒడ్డె రాజు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా బోనాల పండుగ



బోధన్‌రూరల్(బోధన్): సాలూర, బోధన్ మండలాల్లోని పలు గ్రామాల్లో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయా గ్రామాల్లో బోనాల పండుగను పురస్కరించుకుని గ్రామ మహిళలు, గ్రామపెద్దలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో..



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని ముదిరాజ్ కులస్తులు వైభవోపేతంగా నిర్వహించారు. భగత్ సింగ్ విగ్రహం నుంచి జాతీయ రహదారి మీదుగా ముదిరాజ్ కుల సంఘం మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని శోభాయాత్రగా బస్టాండ్ వద్ద ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆలయంలో పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు సుంకరి రాజేశ్వర్, సుంకరి మురళి, కొత్తపల్లి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్‌పీ క్యాంప్‌లో..



ఎడపల్లి(బోధన్): ఏఆర్‌పీ క్యాంప్‌లో గ్రామదేవతలకు బోనాలను మహిళలు సమర్పించారు.

వన భోజనాల సందడి



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం వన భోజనాల సందడి నెలకొంది. వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించి భక్తిని చాటుకున్నారు. అనంతరం గ్రామ శివారులోని అటవీ ప్రాంతానికి వన భోజనాలకు వెళ్లారు.

నల్లపోచమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఆర్మూర్‌టౌన్: ఆషాఢమాసం కావడంతో ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణంలోని నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, పెద్దమ్మ ఆలయం, మహాలక్ష్మీ మందిరంలో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. బంధుమిత్రులతో కలిసి వన భోజనాలు చేశారు.

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని నవనాథ సిద్ధుల గుట్టపై గల శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ఆలయ పరిసర ప్రాంతాల్లో పల్లకిసేవ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబు, రోటరీ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: మొక్కలు నాటిన తర్వాత వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు అన్నారు. పట్టణంలోని రామాలయం ఆవరణలో ఆర్మూర్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినెలా రెండో ఆదివారం అరగంట సుచి–శుభ్రత కార్యక్రమం చేపడుతున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్‌హెచ్‌వో హాజరై మొక్కలు నాటారు. ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తమ ఇంటి ముందు మొక్కలు నాటి పరిసరాలను శుభ్రంగా ఉంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ఇలాంటి కార్యక్రమం చేపడుతున్న రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణను ఆయన అభినందించారు. రోటరీ కార్యదర్శి తులసి, కోశాధికారి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ గంగామోహన్ చక్రు పాల్గొన్నారు.

డబ్బా ఇలా.. చెత్త వేసేది ఎలా?



హుస్నాబాద్ కాలనీలో ఏర్పాటు చేసిన చెత్త డబ్బాలు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హుస్నాబాద్ కాలనీలో చెత్తడబ్బాల పరిస్థితి అధ్వానంగా ఉంది. చెత్తను చెత్తడబ్బాలో వేయాలని సూచిస్తున్న అధికారులు వాటి నిర్వహణను మాత్రం పట్టించుకోవడం లేదు. చెత్త డబ్బాలు ఉన్నా లేకున్నా ఒకటే పరిస్థితి ఉందని కాలనీవాసులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని లేదా ఉన్న డబ్బాలనే సరిచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సన్మానం



కమ్మర్‌పల్లి: టీపీసీసీ అధికార ప్రతినిధిగా నియమితులైన బి.వేణుగోపాల్ యాదవ్‌ను కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీని బోలపేతం చేస్తామని వెల్లడించారు. కష్ట కాలంలో పార్టీ వెంట ఉన్న కార్యకర్తలు, నాయకులను వదులుకోబోమని తెలిపారు. మండలాధ్యక్షుడు సుంకెట రవి, నాయకులు తక్కూరి దేవేందర్, బోనగిరి భాస్కర్, తిప్పిరెడ్డి శ్రీనివాస్, మోమన్‌రెడ్డి, బద్దం రాజేశ్వర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఇన్‌సీడియోస్ – (తెలుగు) – 10.45, 04.20, 9.45 పీఎం (తెలుగు)– 1.15 ఎస్‌పీవై (తెలుగు)–6.50
స్క్రీన్-2 –	సామజవరగమన – 10.00, 4.00, 7.00, 10.00, రుద్రంగి–1.00
స్క్రీన్-3 –	రంగబలి – 10.40, 1.35, 07.25, 10.20, ఓ సాథియా – 4.30
స్క్రీన్-4 –	ఎస్‌పీవై (తెలుగు)– 11.00, భాగ్ సాలే–1.55, 10.10 లీలీ(తెలుగు) – 4.35 సర్కిల్(తెలుగు)–7.20